ప్రజాశక్తి

శనివారం 20 సెప్టెంబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తున్న కలెక్టర్ రాజాబాబు

వచ్చే ఆగస్టు నాటికి

వెలిగొండ పూర్తయ్యేలా చర్యలు

ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పశ్చిమ ప్రకాశంలో నిర్మాణ దశలోని 'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' వచ్చే ఏడాదిలో ఆగస్టు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రాజాబాబు తొలి ప్రాధాన్యతగా వెలిగొండను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్టుకు సంబంధించి పెద్దదోర్నాల మండల పరిధిలోని కొత్తూరు గ్రామ సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న ▶ 6లో

బాపట్ల జిల్లాకు

కొత్త రైలు మార్గం

- మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల రైల్వేలైను నిర్మాణానికి మార్గం సుగమం
- ప్రకాశం జిల్లాలో ఒంగోలు-దొనకొండ మధ్య రైల్వేలైను నిర్మాణం
- సిద్ధమవుతున్న సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా కోస్తా తీరప్రాంత వాసుల చిరకాల కోరిక త్వరలో తీరనుంది. రాష్ట్రంలో 11 మార్గాల్లో 1,960 కిలోమీటర్ల మేర 26 కొత్త రైల్వే లైన్ల ప్రాజెక్టుల కోసం నివేదికల రూపకల్పన జరిగింది. ఈ మేరకు కొత్త రైల్వే లైన్లు నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంబంధించి మొత్తం నాలుగు కొత్త రైల్వే లైన్లు నిర్మాణం జరగనున్నాయి. ఎప్పటి నుంచో ప్రతిపాదనల దశలో ఉన్న మచిలీపట్నం-రేపల్లె మధ్య 45.30 కిలోమీటర్ల మేర కొత్త రైల్వేలైన్‌కు, బాపట్ల-రేపల్లె మధ్య 45.81 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్, విజయవాడ-గూడూరు మధ్య 293 కిలోమీటర్ల నాలుగో లైన్, ప్రకాశం జిల్లాలో ఒంగోలు-దొనకొండ మధ్య 87.45 కిలోమీటర్ల కొత్త లైన్ నిర్మాణాల కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధమవుతున్నాయి.

మచిలీపట్నం-రేపల్లె-బాపట్ల కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కోసం గతంలోనే సర్వే జరిగింది. ముందుగా మచిలీపట్నం-రేపల్లె వరకు నూతన రైల్వేలైన్ అనుకున్నప్పటికీ ఆ రైల్వే లైన్‌ను బాపట్ల వరకు పొడిగించేందుకు రైల్వేశాఖ ఆమోదం తెలిపింది. రేపల్లె-బాపట్ల మధ్య 45.81 కిలోమీటర్ల రైల్వేలైన్ సర్వే కోసం రూ.1.15 కోట్ల నిధులను రైల్వేశాఖ గతంలోనే మంజూరు చేసింది. మచిలీపట్నం నుంచి రేపల్లె వరకు 45.30 కిలోమీటర్ల రైలు మార్గాన్ని ఒక సెక్షన్‌గా, రేపల్లె నుంచి బాపట్ల వరకూ 45.81 కిలోమీటర్ల రైల్వేలైన్ మరో సెక్షన్‌గా తీసుకున్నారు. ఈ మేరకు రెండు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే ▶ 2లో



అంగన్‌వాడీల రాష్ట్ర మహాసభలకు సిద్ధమైన కాపు కళ్యాణ మండపం

అంగన్‌వాడీల వెతలు తీరేదెప్పుడో.?

▶ 8లో

గంట వర్షానికే..

నగరం జలమయం

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: సిపిఎం

▶ 5లో



ఒంగోలుకు చేరుకున్న రణభేరి జాతా

బోధనేతర పనులతో ఉపాధ్యాయుల ఇక్కట్లు

▶ 5లో

మార్కాపురం మెడికల్ కాలేజీని

ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలి

- వైసిపి నేతల డిమాండ్
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



మార్కాపురం మెడికల్ కళాశాల వద్దకు భారీగా తరలివచ్చిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ ఆధీనంలోని మెడికల్ కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరణ చేయడంపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ చలో మెడికల్ కాలేజ్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం నాడు మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వైసిపి శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి వైసిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు నాయకత్వం వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌లతో పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల వైసిపి ఇన్‌చార్జిలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయవరం సమీపంలోని తుమ్మలచెరువు రోడ్డు దగ్గర నుండి మెడికల్ కళాశాల వరకు భారీ ర్యాలీతో నేతలు మెడికల్ కళాశాల ▶ 2లో



సెల్ఫీలు తీసుకుంటున్న వైసిపి నేతలు

'కూటమి' ప్రభుత్వ తీరుతో

రైతులకు ముప్పతిప్పలు

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య



మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్రంలో ఏడాదికాలంగా రైతులు పండించిన అన్ని పంటలనూ కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ.. పంట కొనుగోలు విషయంలో రైతులను ముప్పతిప్పలు పెడుతోందని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలను ప్రభుత్వ విధానాలతో అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లేక, సాగు ఖర్చులు పెరిగిపోయి, పండించిన పంటను ఆయిన కాడికి తెగ నమ్ముకుని రైతులు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారన్నారు. దీంతో ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందో తెలియక క్రమంగా రైతులు ఏ పంట వేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం 2047లో ఏం చేయాలంటూ.. విజన్ గురించి మాట్లాడుతున్నారని, 2026లో రైతులు ఏ పంటలు సాగు చేయాలో చంద్రబాబు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లాలో ఈ యేడు నల్లబర్లీ రైతులు ఆర్థిక సంక్షోభంలో ▶ 2లో

బాపట్ల జిల్లాకు కొత్త రైలు మార్గం

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టి, డీపీఆర్ తయారీకి రైల్వే శాఖ వేర్వేరుగా ఆదేశాలు జారీ చేసింది. మచిలీపట్నం-రేపల్లె మధ్య చేపట్టబోయే 45.30 కిలోమీటర్ల కొత్త రైల్వేలైనుకు సంబంధించి గతంలోనే ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వేబోర్డు ఆదేశాలిచ్చింది. ఈ రైల్వే లైన్‌ను రేపల్లే వరకు వేసి ముగించే కంటే దీన్ని బాపట్ల వరకు కొనసాగించి చెన్నై-హౌరా లైన్లో కలపడం వల్ల సముద్రానికి సమాంతరంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడుతుందని వచ్చిన విజ్ఞప్తుల మేరకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ కోసం ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ రైలు మార్గం కోసం గతంలో ఆందోళనలు కూడా జరిగాయి. చివరికి కూటమి ప్రభుత్వంలో రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వారి కల నెరవేరబోతోంది. ఈ రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే విజయవాడతో సంబంధం లేకుండా మచిలీపట్నం-రేపల్లె -బాపట్ల రైల్వేలైన్ ప్రత్యామ్నాయ మార్గంగా మారుతుంది. ఈ రైల్వే మార్గం మచిలీపట్నం పోర్టుకు సరకు రవాణాలో కీలకం కాబోతోంది. ప్రస్తుతం ఇప్పుడున్న రైల్వే మార్గంలో మచిలీపట్నం నుంచి గుడివాడ, విజయవాడ మీదుగా తెనాలి వరకు వెళ్లాలంటే దాదాపుగా 120 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. అలాంటిది మచిలీపట్నం-రేపల్లె బాపట్ల మధ్య కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే తెనాలి, బాపట్ల వరకు చేరుకోవడానికి దూరం తగ్గిపోవడంతో పాటు సమయం ఆదా అవుతుంది. ఇప్పటికే తెనాలి-రేపల్లే మధ్య రైల్వేలైన్ ఉంది. ఈ కొత్త మార్గం ద్వారామచిలీపట్నం నుంచి చెన్నై, తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణం సులభంగా ఉంటుందని చెబుతున్నారు. మచిలీపట్నం నుంచి చేపలు, రొయ్యల వంటివి కూడా రవాణాకు మార్గం సుగమం అవుతుంది. బాపట్ల జిల్లాలో నిజాంపట్నం పోర్టు నిర్మాణం కూడా జరుగుతున్న క్రమంలో ఈ రైల్వేలైన్ వల్ల సరకు రవాణాకు కూడా ప్రయోజనం ఉంటుంది. ఈ రైల్వే లైన్ నేరుగా బాపట్ల వద్ద హౌరా-చెన్నై ప్రధాన రైల్వే మార్గంతో అనుసంధానం కావడంతో సుమారు 100 కిలోమీటర్ల వరకూ దూరం కూడా తగ్గుతుంది. మచిలీపట్నం నుంచి చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నుంచి కష్ణానది దాటి అక్కడి నుంచి రేపల్లె, నిజాంపట్నం, పేర్లిపాడు మీదుగా బాపట్ల వరకు నూతన రైల్వేలైన్ రానుంది.ఇప్పటికే విజయవాడ-గూడూరు మధ్య మూడో లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో ఉన్న రద్దీ దృష్ట్యా నాలుగో లైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు. ఒంగోలు-దొనకొండ మధ్య నూతన లైన్ నిర్మాణం కోసం కూడా సుధీర్ఘకాలంగా ప్రతిపాదనలో ఉంది. ఈ లైన్ ఏర్పాటుతో తూర్పున ఉన్న గూడూరు - విజయవాడ రైల్వే లైన్‌తో, పశ్చిమాన ఉన్న గుంతకల్-గుంటూరు సెక్షన్‌తో అనుసంధానం ఏర్పడనుంది. కొత్త లైన్ నిర్మాణాల కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు డిసెంబరు నాటికి సిద్ధం కానున్నాయి. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో మచిలీపట్నం-రేపల్లె - బాపట్ల రైల్వేలైన్ పనులు ప్రారంభిస్తారని తెలుస్తోంది.

మార్కాపురం మెడికల్ కాలేజీని

ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు చేరుకున్నారు. మెడికల్ కళాశాల కోసం నిర్మాణంలోని భవనాల వద్ద నేతలంతా సెల్ఫీలు దిగారు. అక్కడకు వచ్చిన ప్రజలకు ఆ భవనాల గురించి వివరించారు. ఇన్ని భవనాలు పూర్తయినా... కూటమి ప్రభుత్వం మాత్రం ఏమీ చేయలేదని, పునాది దశలో ఉన్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైసిపి నేతలు ఎద్దేవా చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా తీసుకురాని విధంగా ఏకంగా 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చిన ఘన చరిత్ర మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పేదలకు ప్రభుత్వం నుండి మెరుగైన వైద్యం అందించాలని, పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు ఖరీదైన వైద్య విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ మెడికల్ కళాశాల కోసం కృషి చేసినట్లు చెప్పారు. ఈ పాటికే జగన్ తీసుకువచ్చిన మెడికల్ కళాశాలల ద్వారా 2500 మంది వైద్య విద్యలో రాణిస్తున్నట్లు చెప్పారు. మార్కాపురం ప్రాంతంలోనూ వైద్య రంగం అభివృద్ధి కావాల్సిన అవసరం ఉందన్నారు. అందు కోసం వైఎస్ జగన్ మార్కాపురంలో మెడికల్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అనతికాలంలోనే ఇన్ని భవనాలు పూర్తయితే... ఇక్కడ ఏమీ లేదని కుంటి సాకులతో వైద్య విద్యను వ్యాపారం చేయాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకోవద్దని హితవు పలికారు. ప్రజలకు వైద్య పరంగా నష్టం కలిగించే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, గిద్దలూరు వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనుకాడబోనని హెచ్చరించారు. కార్యక్రమంలో కనిగిరి వైసిపి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు వైసిపి ఇన్‌చార్జి చుండూరి రవి, స్థానిక నాయకులు వైసిపి రాష్ట్ర ఇంటలెక్చువల్ కార్యదర్శి డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, ఎపి ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీర్జా షంషీర్‌అలీబేగ్, ఎఎంసి మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మార్కాపురం ఎంపిపి బండి లక్ష్మీదేవి క్రిష్ణారెడ్డి, జడ్‌పిటిసి నారు బాపనరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ముప్పుతిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

చిక్కుకున్నారన్నారు. ఇంకా రైతుల వద్ద 30 శాతం నల్లబర్లీ పొగాకు నిల్వలు ఉన్నాయన్నారు. అందులో ఐదు లక్షల కిలోలు కొంటామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మరో 25 లక్షల కిలోలు ప్రైవేటు కంపెనీలు కొనుగోలు చేస్తాయని ప్రభుత్వం చెబుతోందన్నారు. దీనిపై స్పష్టత లేదని చెప్పారు. రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకును రూ.1500- రూ.2 వేలకు అమ్ముకుని రైతులు నష్టాలపాలవుతున్నారని పేర్కొన్నారు. పొగాకు ఇంటి ముందు ఉంటే శవం ఉన్నట్లు భావిస్తూ ఏదో రకంగా అమ్ముకొనే విధంగా ప్రభుత్వ విధానాలతో రైతులు విసుగు చెందుతున్నారన్నారు. ఇప్పటికే క్యాబినెట్లో చర్చించి రైతుల వద్ద ఉన్న 30 శాతం నల్లబర్లీ పొగాకును రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరతను సష్టించే విధంగా ముఖ్యమంత్రి విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటాను ఎవరికీ చెప్పకుండా 25 శాతం తగ్గించుకొని వచ్చారని, దీనికి రూ.1500 కోట్లు డబ్బు తెచ్చుకున్నారని చెప్పారు. రైతుకు మాత్రం బస్తాకు రూ.800 ఇస్తామని చెప్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కేంద్రంలో మోడీ రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలతో శ్రీలంకలో ఏర్పడిన ఆహార సంక్షోభ పరిస్థితిని దేశంలో కల్పిస్తారని కృష్ణయ్య విమర్శించారు. ఇప్పటికైనా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి.. వ్యవసారంగాన్ని మరింత అభివద్ధి చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వర్లు, హరిబాబు, నాగేశ్వరరావు, కౌలు రైతుసంఘం నాయకులు పి.కొండయ్య పాల్గొన్నారు.

అదుపుతప్పి బైకులను ఢీకొన్న కారు..

- భర్త మృతి, భార్యకు గాయాలు
- మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - చీరాల

కారు అదుపుతప్పి బైకులను ఢీకొన్న ఘటనలో భర్త మృతి చెందాడు. అతని భార్య, మరో ముగ్గరికి గాయాలయ్యాయి. వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చీరాల మండలం తోటవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం, కొత్త నందాయపాలెం గ్రామానికి చెందిన ఆట్ల అంజిరెడ్డి (55) మృతిచెందాడు. అతని భార్య గాయత్రి, శ్రీను అనే మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడు తన భార్యతో కలిసి హాస్పిటల్‌కు బైకుపై చీరాల వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి బయలు దేరాడు. అదే సమయంలో ఘటనా స్థలం వద్ద వచ్చే



మృతి చెందిన అంజిరెడ్డి

ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి అంజిరెడ్డి బైక్‌ను ఢీకొంది. అనంతరం మరో బైకు ఢీకొంది. ఈ ఘటనలో అంజిరెడ్డి అక్కడికక్కడే మతి చెందాడు. గాయత్రి, శ్రీనుకు గాలయ్యాయి.అదే విధంగా కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను చీరాల ఏరియా ఆసుపత్రికి



క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్ఐ

తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఈపురిపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను స్థానికులు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నిమ్మతోటలను పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మతోటలు పరిశీలన

ప్రజాశక్తి -కనిగిరి

మండల పరిధిలోని చాకిరాల గ్రామ రైతులు సాగు చేసిన నిమ్మ తోటలను ఉద్యానవన శాఖ అధికారి విష్ణు ప్రియ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిమ్మ తోటల యాజమాన్యం, సస్యరక్షణ పై రైతులకు అవగాహన కల్పించారు.నిమ్మ తోటల్లో కొమ్మ ఎండు తెగులు గుర్తించారు. రైతులు ఎండిన కొమ్ములను కత్తిరించి గాయానికి మైలుతుతి పేస్ట్ పూయాలన్నారు. కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. రైతులకు ఉద్యాన శాఖ తరపున అందుబాటులో ఉన్న పథకాల గురించి వివరించారు. పండ్లు, కూరగాయలు, పూల తోటల పెంపకానికి ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ సహాయకురాలు శిరీష పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని ఎస్. సాయి మనస్వినికి సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా తాను చదివిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు పింటర్‌కు శుక్రవారం బహూకరించారు. అప్పటి గురువులు సునీల, అర్రిబోయిన రాంబాబుల చేతులమీదుగా ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి కి పింటర్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు రవిచంద మాట్లాడుతూ సాయి మనస్విని ఉన్నతమైన ఆలోచనలతో పూర్వ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందని అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన మరియు బోధనేతన సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని క్రిస్టియన్‌పాలెంలో నివసిస్తున్న గోంగటి పిచ్చయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న దర్శి మానవతా సంస్థ తరుపున రూ.6,000 వేల ఆర్థికసాయాన్ని బాధితకుటుంబ సభ్యులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ దనిరెడ్డి, వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షులు చీదెళ్ల బసవయ్య, ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి.వేణు, డైరెక్టర్లు సుశీలమ్మ, సుబ్బారావు, మోషే, ప్రేమకుమార్, న్యూస్ శ్రీనివాసరావు, సింగంశెట్టి మల్లి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి-టంగుటూరు

అపరిష్కృతంగా ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎల) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు వివేకానంద వివేకానంద మాట్లాడుతూ రాష్ట్రంలో 20,000 మంది విఆర్‌ఎలు రెవెన్యూ శాఖలో అట్టడుగు స్థాయిలో అనేకమైన ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకోలేక అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారు. 2014లో వేతనాలు పెంచిన ప్రభుత్వం, డిఎ 500 పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిపారు. గత ప్రభుత్వ ఇచ్చిన డిఎని రికవరీ పేరుతో ఒక్కొక్క విఆర్‌ఎ వద్ద నుంచి రూ. 13000, రూ.15 వేల వంతున రికవరీ చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న రెవెన్యూ డివిజన్ అధికారికార్యాలయం వద్ద, 22న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండలరావు, ఉపాధ్యక్షురాలు శ్రావణి, కార్యదర్శి వేణు, సహాయ



ధర్నా నిర్వహిస్తున్న విఆర్‌ఎలు

కార్యదర్శి మల్లెల కష్ణ, ట్రెజరర్ నారాయణ, గౌరవాధ్యక్షుడు సుందర్రావు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

శింగరాయకొండ : విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శింరాయకొండ తహశీల్దారు రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలు మాట్లాడుతూ తమకరు పే స్కేలు అమలు చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి విఆర్‌ఒలుగా ప్రమోషన్లను ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ. 21 వేల ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల అసోసియేషన్ అధ్యక్షుడు పొనుగోటి సాల్మన్ , కార్యదర్శి పేరాబత్తిన పవన్ కుమార్, కసుకుర్తి ప్రసాద్, విఆర్‌ఎలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-శింగరాయకొండ

గంజాయి విక్రయించినా, తాగినా సహించేది లేదని జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శింగరాయకొండ పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై దష్టి పెట్టాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధలతో పోలీసు స్టేషన్‌లో వచ్చే ఫిర్యాదుదారులకు భరోసా కల్పించే విధంగా పనిచేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పోలీస్ శాఖపై నమ్మకం కలిగే విధంగా పనిచేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ సిబ్బందితో మాట్లాడారు. గంజాయి విక్రయించినా, తాగినా కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె. నాగేశ్వరరావు ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు. ఎస్‌బి సిఐరాఘువేంద్ర



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

శింగరాయకొండ సిఐ సిహెచ్.హజరత్తయ్య, ఎస్ఐ మహేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు : టంగుటూరు పోలీస్ స్టేషన్ జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిసరాలు పరిశీలించారు. పలు రికార్డులు పరిశీలించారు. నమోదైన కేసులపై ఆరా తీశారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్)కె. నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రాఘువేంద్ర, సింగరాయకొండ సిఐ హాజరత్తయ్య, ఎస్ఐ మహేంద్ర, టంగుటూరు ఎస్ఐ నాగేమలేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని శింగరాయకొండ-పాకల రోడ్డులో బీపీ ఛానల్ కాలువ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పాకలకు చెందిన శెట్టి రామలింగయ్య, శింగరాయకొండకు చెందిన షేక్ మస్తాన్‌వలికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను శింగరాయకొండలోని శివరామరెడ్డి హాస్పిటల్‌లో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-మద్దిపాడు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఒంగోలు రూరల్ సిఐ ఎం.శ్రీకాంత్ బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం గ్రామానికి చెందిన బండారి ఎస్తేరమ్మ, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దీప కుమార్ మాలిక్ వెల్లంపల్లి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి వారి పట్టుకున్నట్లు తెలిపారు. వెల్లంపల్లి వద్ద ఆవాస్ హోటల్ ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తహశీల్దారు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకట సైదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి- వెలిగండ్ల

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కష్ణ పావని తెలిపారు. వెలిగండ్లలో బహిరంగ ప్రదేశాల్లో ఉన్న మద్యం సీసాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి గ్లాసులు పడేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారని, వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

కొండపి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ ప్రేమ్ కుమార్ హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగి పడవేసిన బాటిల్స్, చెత్తను గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజల సహాయంతో తగలబెట్టారు ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ అంకారావు,పోలీస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

వైద్యశాలలో పరిశీలన

ప్రజాశక్తి- పొన్నలూరు

పొన్నలూరు ప్రాథమిక వైద్యశాలను డిఎంహెచ్ఒ డాక్టర్ టి. వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల నివారణ పట్ల వైద్య అధికారులకు, సిబ్బందికి తగు సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య వైద్యులు డాక్టర్ చైతన్య కష్ణ, డాక్టర్ మల్లికార్జున, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సిమెంట్ బల్లలు బహూకరణ

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు దాతలు సిమెంట్ బల్లలు బహూకరించారు. పామూరుకు చెందిన కొంగళ ప్రసాద్, షేక్ ఖాదర్ బాషా, ఉప్పలపాటి శుభాని, సునీల్ బాబు విద్యార్థినుల సౌకర్యార్థం రూ.21 వేల విలువైన ఆరు సిమెంటు బల్లలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు, అధ్యాపక సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు

పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి


ఎత్తిపోతల పథకం పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - మెదరమెట్ల

యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాన్ని సిపిఎం నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ఆంజనేయులు మాట్లాడారు. ఈ పథకం పూర్తయితే 2 మండలాల్లో 12 గ్రామాల పరిధిలోని 20వేల ఎకరాల భూమి సాగులోనికి వస్తుందని అన్నారు. త్రాగునీటి ఇబ్బంది ఉండదని అన్నారు. 2008లో రూ.177 కోట్లతో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారని, 2011 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అయితే ఇప్పటి వరకు నాలుగు ప్రభుత్వాలు మారిన ప్రాజెక్టుపై సవతి ప్రేమ చూపిస్తూ ఎవ్వరు తగినంత నిధులు కేటాయించలేదని ఆరోపించారు. 2025 మార్చి బడ్జెట్లో రూ.8.5 కోట్లు మాత్రమే కేటాయించి పనులు ప్రారంభించలేదని అన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రాజెక్టుకు నిధులు పెంచి వెంటనే పనులు ప్రారంభించే విధంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రయత్నం చేయాలని కోరారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కొంతమందికి ఇంకా పెండింగులోనే ఉందని అన్నారు. నివాస ప్రాంత ఇళ్లను కేటాయించటం, ప్యాకేజీ, ఇళ్ల స్థలాలు ఇవ్వటం పూర్తిగా జరగలేదని అన్నారు. కొరిసపాడు చెరువు క్రింద సాగులో ఉన్న మాగాణిని ప్రాజెక్టు ప్రారంభించిన నాటి నుండి పంట వేయకుండా చిన్న, సన్న కారు రైతులే కాకుండా దళితులు నష్టపోయారని అన్నారు. ప్రాజెక్టు ప్రారంభించి 17ఏళ్లు గడుస్తున్న ఒక్క రూపాయి కూడా రైతులకు కౌలు చెల్లించలేదని అన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై రవీంద్రబాబు, బి దశరథ, సేవ కోటేశ్వరరావు, కంచర్ల హరిబాబు, కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించొద్దని ఆందోళన


ఆందోళన చేస్తున్న జగనన్న కాలనీవాసులు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను తొలగించడానికి యత్నించిన విద్యుత్ సిబ్బందిని కాలనీ ప్రజలు మూకుమ్మడిగా అడ్డుకొని తొలగించిన స్థానంలోనే తిరిగి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసే వరకు తగ్గేది లేదని సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. జగనన్న కాలనీలో మొదట్లో అవసరానికి మించి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామని, ప్రస్తుతం వాటి అవసరం లేకపోవడంతో వాటిని తొలగిస్తున్నామని విద్యుత్ అధికారులు ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులకు వివరణ ఇచ్చారు. కాలనీలో ప్రజలతో ఆందోళనకు దిగిన సిపిఎం నాయకులు కె శరత్, పి కొండయ్య మాట్లాడారు. కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు తొలగిస్తే లోఓల్టేజ్ సమస్యతో లైట్లు వెలగవని, కాలనీని అంధకారం చేయడానికి తొలగిస్తున్నారాని ప్రశ్నించారు. ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించరాదని నినాదాలు చేశారు. విద్యుత్ అధికారులను అడ్డుకున్నారు. నాలుగేళ్ళ నుండి ఇక్కడ 500పై చిలుకు కుటుంబాలు నివాసాలు ఉంటున్నప్పటికీ కనీసం రోడ్లు కూడా లేవని అన్నారు. పారిశుధ్యం పనులు జరగడం లేదని అన్నారు. రాత్రయితే పాములు తిరుగుతున్నాయని అన్నారు. ఇన్ని సమస్యలతోపాటు వీధి దీపాలు వెలగడం లేదని, విద్యుత్, మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదని అన్నారు. విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ తొలగిస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు షారోనా, శీను, లక్ష్మి పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని నిరసన



బాపట్లలో దస్తావేజు లేఖరుల నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

స్థలాలు, పొలాలు ఇతర రిజిస్ట్రేషన్లకు ఓటీపీ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులపాటు పెన్ డౌన్ నిరసన నిర్వహిస్తామని దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు బుజ్జి తెలిపారు. ఆస్తి కొనుగోలు, అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. దస్తావేజు లేఖరుల వృత్తికి తీరని నష్టం వాటిల్లుతుందని తెలిపారు. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్చూరు : రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన సాఫ్ట్వేర్‌లో మార్పు తీసుకురావాలని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్ల సంఘం నాయకులు కోరారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు ప్ల కార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. దస్తావేజు లేఖరులు కాల్వ సత్యనారాయణ, ఆదిపూడి మోహనకృష్ణ, తులసి శ్రీనివాసరావు, కారంపూడి సందీప్ తేజ, పి రాజేష్, వై శ్రీనివాసరావు, కె లలిత ప్రియ దర్శిని, ఆర్ రవికుమార్, శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

రేపల్లె : దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ ప్రెసిడెంట్ మరక మురళి డిమాండ్ చేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. వైస్ ప్రెసిడెంట్ గోపాల్, సెక్రటరీ బి మురళి, కాజా, కె వేణుగోపాల్, డి ఆంజనేయులు, సుబ్బయ్య, దేవి, హరిహిత పాల్గొన్నారు.


పర్చూరులో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు


రేపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు


కరపత్రం ప్రదర్శిస్తున్న సిఐటియు నాయకులు

21న సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండులో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్ర ఆవిష్కరణ శుక్రవారం చేశారు. ఈనెల 21న జరిగే సిఐటియు మండల మహాసభ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌కె భాష, ఉపాధ్యక్షులు జి గణేష, శిరోమణి పాల్గొన్నారు.


రక్త దానం చేస్తున్న యువకులు

రోటరీ ఆవరణలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

రోటరీ క్లబ్, బిస్మిల్లా హెల్ప్ హ్యాండ్ సహకారంతో చీరాల ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ షారుక్, డాక్టర్ రాజాశివం పర్యవేక్షణలో రక్త దానం చేసిన దాతల నుండి రక్తం సేకరించారు. రక్తదానం, అవయవ దానం, నేత్రదానం చేయుట వలన తోటి మానవులకు ప్రాణదానం చేసినట్లేనని రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, కోశాధికారి గోరంట్ల నాగేశ్వరరావు, సోమేపల్లి రామ్మోహనరావు, పోపూరి మోహనరావు, గిరి అన్నారు. రక్త దాతలకు పండ్లు, శీతల పానీయాలు అందించి అభినందనలు తెలిపారు.


నగరంలో వైద్య శిభిరం ప్రారంభిస్తున్న శివప్రసాద్

నగరం : మహిళల ఆరోగ్యం కుటుంబ సంక్షేమంలో భాగంగా మెగా రక్తదాన శిభిరాన్ని మంత్రి అనగానీ సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. రక్త దానం ప్రాణ దానంతో సమానమని అన్నారు. స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ కళాశాల ఎన్సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు చింతల సుబ్బారావు, తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాజా రాము, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, డాక్టర్ రత్నకు మారి, డాక్టర్ సామెల్ ప్రదీప్, సోమరాజు శ్రీనివాసరావు, ఉప్పాల పాములు, లుక్క గుడారంకయ్య పాల్గొన్నారు.

వీధి విక్రయ వ్యాపారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీధి విక్రయ దారులకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు సిటీ మిషన్ మేనేజర్ అరుణకుమారి తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వీధి విక్రయ దారులు రూ.100 పురపాలక కార్యాలయంలో చలానా చెల్లించాలని తెలిపారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఐడి కార్డు జిరాక్స్ మెప్మా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఆయా బ్యాంకుల్లో వారి రోజువారి ఆర్థిక పరిస్థితిని బట్టి బ్యాంకు నుండి రుణాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమేష్‌బాబు

పంచాయతీ పాలనపై శిక్షణ

ప్రజాశక్తి - రేపల్లె

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మండల స్థాయిలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో శుక్రవారం ప్రారంభమైనట్లు ఇంచార్జ్ ఎంపిడిఒ డివి రమేష్ బాబు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ గ్రామ స్థాయిలో సంపద సృష్టి, దానివలన కలిగే ప్రయోజనాలు, ఆదాయం సంపాదించే మార్గాలు గురించి ఓఎస్ఆర్ మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేయుట గురించి శిక్షణ తరగతుల్లో పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఎంపిడిఒ

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - పర్చూరు

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి తెలిపారు. శుస్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు విఒఓలు, వాలంటరీ టీచర్లకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనేక కారణాలతో పాఠశాలకెళ్ళే వయసులో చదువుకు నోచుకోక, చదువుకునే వయసు దాటిపోయిన వయోజనులకు వారి దైనందిన కార్యక్రమాల్లో ఉపయోగపడేలా చదవడం, రాయడం నేర్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో 15ఏళ్లు దాటి చదువురాని వయోజనులను గుర్తించి, వారి వివరాలు నమోదు చేసుకుని చదువు చెప్పేందుకు వాలంటీర్ టీచర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎన్జీఒలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, పి 4 మార్గదర్శులు, ఇతర పెద్దల సహాయ సహకారాలు తీసుకోవాలని చెప్పారు. సామాజిక బాధ్యతగా కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ కొసన సత్యనారాయణ, ఎపిఎం రామకృష్ణ, వయోజన విద్య పర్యవేక్షకులు మనోరంజన్ బాబు పాల్గొన్నారు.


బ్రష్, పేస్టులు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

ఉచితంగా దంత పరీక్షలు

ప్రజాశక్తి - రేపల్లె

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రైలుపేటలోని రామకృష్ణ విద్యాలయంలోని బాల, బాలికలకు డాక్టర్ కుడితపూడి వెంకట రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల, బాలికలకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు 100 మంది విద్యార్థులకు టూత్ బ్రష్‌లు, పేస్టులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ రీజినల్ చైర్మన్ ఎంఎం సక్సేనా, క్లబ్ కార్యదర్శి టీఎస్ రామకృష్ణ, కుడితపూడి హరిత, యార్లగడ్డ బుచ్చిరావు, వేములపల్లి రాఘవేంద్రరావు, గొట్టుముక్కల బాపారావు, తలసిల రామారావు, కేసన పూర్ణచంద్రరావు, కోడూరి ప్రవీణ్, సిహెచ్ కిషోర్, చెన్ను సాయిబాబు, హెచ్ఎం రమాదేవి, అన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పల్మనాలజీ' పరీక్షల పరికరం ఏర్పాటు శుభపరిణామం

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఊపిరితిత్తుల పని తీరును అంచనా వేసి పలు చికిత్సలకు తోడ్పడే పరీక్షల పరికరాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు.



పల్మనాలజీ పరికరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఈ పరికరం పల్మమానాలజీ విభాగంలోనే కాకుండా అన్ని విభాగాల వైద్యులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో రూ.50 లక్షలతో పల్మనాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో ఏర్పాటు చేసిన మూడు ఊపిరితిత్తుల పనితీరు పరీక్షలు పరికరాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ గాలిలోని ఆక్సిజన్‌ను రక్తంలోకి ఊపిరితిత్తులు ఎంత స్థాయిలో గ్రహిస్తున్నాయో కూడా పరీక్షిస్తారన్నారు. వ్యాయామం ఊపిరితిత్తులపై ఎలా ప్రభావం చూపుతుందో తెలుసుకోవడానికీ ఉపయోగపడతాయన్నారు. మొత్తంగా ఊపిరితిత్తుల మార్గాల్లో తడిమిపోయిన భాగాలను గుర్తించడం, ఆక్సిజన్‌ను రక్తంలోకి అందించే సామర్థ్యంలో మార్పులను గుర్తించడం, పొగతాగే అలవాటుతో ఊపిరితిత్తులపై ఎలాంటి ప్రభావం పడిందో అంచనా వేయడం తెలుసుకోవచ్చన్నారు. శ్వాస సంబంధిత మందులు ఉపయోగకరంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడం, పర్యావరణ రసాయనాలతో ఊపిరితిత్తులు ప్రభావితమయ్యాయో గుర్తింపు శస్త్రచికిత్స లేదా ఇతర వైద్య ప్రక్రియలు భరించగల సామర్థ్యం ఉందా అనే అంచనా వేయటం జరుగుతుందన్నారు. ఇలాంటి పరికరం జిజిహెచ్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ఈ పరికరం రావడంలో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, వైద్య విద్య సంచాలకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె అద్దయ్య , డిప్యూటీ సూపరింటెండెంట్స్ డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ ప్రభాకర్ , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ మాధవి లత, గెనెల్ పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ రామ స్వామి , జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పద్మ లత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గా ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుమారవర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ ,డాక్టర్ రంజిత్ బాషా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులు

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

విద్యుత్ భవన్ వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పెండింగ్ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పవర్ ఎంప్లాయిస్ జెఎసి నాయకులు తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జెఎసి పిలుపు మేరకు ఒంగోలు విద్యుత్ భవన్ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకి చేరుకున్నాయి. రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు 21 సమస్యలపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిమిత వైద్య సౌకర్యం, 1999 నుంచి 2004 ఆగస్టు 21 లోపు నియమించబడిన ఉద్యోగస్తులకు ఈపిఎఫ్ టు జిపిఎఫ్ సౌకర్యం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ సిబ్బందికి 2022 నుంచి పిఆర్‌సి ఏరియర్స్ చెల్లించటం, ఈపిఎఫ్ టు జిపిఎఫ్ సౌకర్యం, అన్ని క్యాడర్ల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్ హరికష్ణ నేతత్వంలో జెఎసి కన్వీనర్ కె. వెంకట రవి, జెఎసి కో చైర్మన్ రాఘవ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ.దుర్గాప్రసాద్, ఎస్‌కె జబ్బర్, వైస్ చైర్మన్ ఆనందరావు, పి. రంగమన్నార్, బి.వెంకటేశ్వర్లు, ముఖ్య నాయకులు బివిఎల్ ప్రసాద్, పసుపులేటి వెంకటరావు, ఎస్‌కె వహాబ్, జయకర్, మీటర్ రీడర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

గంట వర్షానికే..

నగరం జలమయం

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: సిపిఎం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

శుక్రవారం రాత్రి గంటపాటు కురిసిన వర్షంతో ఒంగోలు నగరం జలమయమైంది. కర్నూలు రోడ్, భాగ్యనగర్, మార్కెట్ సెంటర్, కొత్త పట్నం బస్టాండ్, బైపాస్ రోడ్ వంటి ప్రధాన రహదారులు ముంపునకు గురై వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగర హెూటల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు సముద్రంలా మారి షాపుల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు ఆర్థిక నష్టాలు చవిచూశారు. ఈ పరిస్థితిని సిపిఎం నగర కమిటీ నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ సిటీ, అమత సిటీ పేర్లతో ప్రజలను ఊరిస్తూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించకపోవడం పాలకుల నిర్లక్ష్యం అని మండిపడ్డారు. గతంలో ప్రారంభించిన పోతురాజు కాలువ



జలమయమైన కర్నూల్‌రోడ్డు

పూడికతీత పనులు మధ్యలోనే ఆగిపోయాయని గుర్తుచేసి, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయకపోతే ప్రతి వర్షం ఇలాంటి ముంపుతో నింపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరానికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలు చేయక పోవడం, సైడ్ డ్రయిన్‌లు అక్రమణలకు గురి కావడం వంటి పరిణామాలు ఈ దుస్థితి కి కారణమన్నారు. ప్రభుత్వం తక్షణం నిధులు కేటాయించి సమగ్ర ప్రణాళికతో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

బోధనేతర పనులతో ఉపాధ్యాయుల ఇక్కట్లు

సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రణభేరి బైకుజాతా

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తరగతి గదుల్లో పాఠాలు చెప్పవలసిన ఉపాధ్యాయులు బోధనేతర పనులతో ఇక్కట్లు పడుతున్నారని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రణభేరి బైకు జాతా మార్కాపురం నుంచి బయలుదేరి కేకే మెట్ల, పొదిలి, దర్శి, తూర్పు గంగవరం, చీమకుర్తి మీదుగా గురువారం సాయంత్రం ఒంగోలుకు చేరుకుంది. ఈ జాతా కు యుటిఎఫ్ బందం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అభ్యసించే పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన ఉపాధ్యాయులు ఆన్లైన్ రిపోర్టులు, సెల్ఫ్ అసెస్‌మెంట్, రిజిస్టర్లు, పిటిఎమ్, ట్రైనింగులు, బయోమెట్రిక్ పనులు వంటి పనులతో తరగతి గదికి దూరమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం బోధనేతర పనుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సుమారు 30 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, వెంటనే రూట్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. అలాగే 12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలని, 30 శాతం ఫిట్‌మెంట్ అమలు పరచాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరణ చేపట్టాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 25న గుంటూరులో జరగనున్న రణభేరి ధర్నాలో ఉపాధ్యాయులు విస్తతంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బైకుజాతలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్. రవి,సి హెచ్ ఉమామహేశ్వరి, యన్. చిన్నస్వామి, ఎం. సంధ్యారాణి, నల్లూరి వెంకటేశ్వర్లు, ప్రభాకరరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఈ-వేస్ట్ సేకరణలో

ఒంగోలు కార్పొరేషన్‌కు మొదటిస్థానం

నేడు సిఎంతో సత్కారం పొందనున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



కమిషనర్ వెంకటేశ్వరరావు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) సేకరణలో ఒంగోలు నగరపాలక సంస్థ రాష్ట్రంలో మొదట స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాన్ని నగరంలో విజయవంతం చేసేందుకు స్థానిక మున్సిపల్ పారిశుధ్య విభాగంలోని శానిటరీ సూపర్‌వైజర్ యస్.పిచ్చయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ బాజ్జీలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఈ-వ్యర్థాలు ఎక్కువగా ఉత్పత్తి జరిగే షాపులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఫలితంగా తక్కువ సమయంలోనే 6.42 టన్నుల ఈ-వ్యర్థాలు సేకరించడం జరిగింది. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కషిని గుర్తించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానించాలని నిర్ణయించి, కమిషనర్‌కు ఆహ్వానం పంపించింది. ఈ మేరకు శనివారం నాడు పల్నాడు జిల్లా మాచర్లలో జరుగుతున్న "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా కమిషనర్ వెంకటేశ్వరరావు సత్కారం అందుకోనున్నారు.

21న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 21న పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెంలో మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులర్పించి పలు అభివద్ధి కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ శాసనసభ్యులతో కలసి పాల్గొంటారు. 11 గంటలకు మర్లపాడు గ్రామంలో నందమూరి తారక రామారావు, దామచర్ల ఆంజనేయులు, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్, శాసనసభ్యులతో కలిసి పాల్గొంటారు.



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

నిబద్ధతతో విధులు నిర్వహించినందునే..

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ

ఎస్పీ తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని పోలీస్ అధికారులు వారికి అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించిన ఫలితంగానే జిల్లాలో శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించగలిగామని తుషార్ డూడి తెలిపారు.బాపట్ల నుంచి చిత్తూరు జిల్లా ఎస్పిగా బదిలీపై వెళ్ళిన తుషార్ డూడికి ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ స్థానిక గౌతమ్ గ్రాండ్‌లో జరిగింది. బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్,జిల్లా పోలీస్ అధికారులు తుషార్ డూడి ని ఘనంగా సన్మానించారు.బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో, సమస్యాత్మక విషయాలను సున్నిత దక్కోణంతో పరిష్కరించే విధానం అలవర్చుకోవడం గొప్ప లక్షణమని అభినందించారు. బదిలీపై వెళ్తున్న చిత్తూరు జిల్లాలో కూడా ఇదే విధమైన శైలిలో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.తుషార్ డూడి మాట్లాడుతూ కష్ణా నది పరివాహక ప్రాంతంలో వరదల సమయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించిందని తెలిపారు. విఐపి బందోబస్తు విధులలో, నేరాలను కట్టడి చెయ్యడంలో అనుకున్నదానికంటే మెరుగ్గా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధులను నిర్వహించారని తెలిపారు.జిల్లాలోని పోలీస్ అధికారులు తుషార్ డూడి సారధ్యంలో వారు నిర్వహించిన విధులు, కేసుల ఛేదనలో అందించిన తోడ్పాటు, ప్రతి విషయంలో ముందుచూపుతో ఆలోచించి క్లిష్ట సమయంలో ఎలా వ్యవహరించాలో చూపిన దిశానిర్దేశం తదితర అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు.ఈ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని సన్మాన గ్రహీత తుషార్ డూడిని దుశ్శాలువతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సి.సి.ఎస్. డి.ఎస్.పీ. పి. జగదీష్ నాయక్, డి.సి. ఆర్.బీ. డి.ఎస్.పీ. బాలమురళి కష్ణ, రేపల్లె, బాపట్ల, చీరాల డి.ఎస్.పీలు ఏ. శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎమ్.డి. మోయిన్, జిల్లాలోని సి.ఐ లు, ఎస్.ఐ లు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తా..

పిసిపల్లి ఎంపిడిఒ కృష్ణారావు

ప్రజాశక్తి- పిసిపల్లి

పిసిపల్లి మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపిడిఒ కృష్ణారావు తెలిపారు. శింగరాయకొండ ఎంపిడిఒ కార్యాలయంలో కృష్ణారావు ఎఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పిసిపల్లి ఎంపిడిఒగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు తనకు సహకరించాలని కోరారు.



ఎంపిడిఒ కృష్ణారావు



వాటర్ కూలర్ బహుకరిస్తున్న దృశ్యం

వాటర్ కూలర్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

క్యూబ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ ప్రాజెక్టు ప్రతినిధులు స్థానిక బదిరుల ఆశ్రమ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ మిషన్ శుక్రవారం అందజేశారు. కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ విభాగ ఆధిపతులు కిషోర్, సతీష్, పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపల్ సురేంద్రబాబు పాల్గొన్నారు.



పూడిక తీత పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి - అద్దంకి

స్వచ్ఛత హీ సేవా 2025 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు వివిధ శుభ్రతా కార్యక్రమాలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా బలిజపాలెం మెయిన్ డ్రెయన్ నందు పూడిక తీయుట, గడ్డి తొలగించడం, బ్లీచింగ్ చల్లించారు. మున్సిపల్ కమిషనర్, స్వచంద్ర డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్, సచివాలయ సిబ్బంది అందరి సహకారంతో పట్టణం మరింత శుభ్రంగా, ఆరోగ్యకరంగా మారడానికి ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న డీఈఓ పురుషోత్తం

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - వేటపాలెం

చదువులతోపాటు ఆటలకూ ప్రాధాన్యత ఇవ్వాలని డిఇఒ పురుషోత్తం అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఆటల పోటీలు ఆయన శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. డీఈఒ, డిప్యూటీ డిఈఓ, వేటపాలెం ఎంఈఓలు ఒకరికొకరు పోటీపడి పరుగు పందెంలో పాల్గొని విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించారు. అనంతరం డివిజన్ క్రీడల కోఆర్డినేటర్ కర్ణ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి రోజు అథ్లెటిక్స్ పోటీలు పూర్తి చేశారు. డిప్యూటీ డిఇఓ డి గంగాధరరావు, ఎంఈఓలు జె సుబ్బయ్య, పి పురుషోత్తం, హెచ్ఎం తలమల దీప్తి, ఎస్ఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు చెరుకూరి. రాంబాబు, బండ్ల భారతి పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న దృశ్యం

చిన్నారులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి - కారంచేడు

హైదరాబాదుకు చెందిన స్మైల్ ఫౌండేషన్, గౌతమ బుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కారంచేడు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక అంగనవాడి పాఠశాలలో చదువుతున్న పిల్లలకు యూనిఫార్మ్స్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ అనిల్ గౌరా, ఇనిస్టిట్యూషన్ నుండి గౌతమ్ బుద్ధా ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు, అంగన్‌వాడి సూపర్వైజర్ హిమబిందు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం



రేపల్లెలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ ఎస్ రమేష్

ప్రజాశక్తి - రేపల్లె

ఆరోగ్య వంత మైన మహిళ, శక్తి వంత మైన కుటుంబం సమగ్ర ఆరోగ్య ప్రచార సేవా కార్యక్రమం ఇసుకపల్లి అర్బన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. అంగనవాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పీహెచ్‌సి సూపర్వైజర్లకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడారు. ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల్లో గుండె జబ్బులు, మధు మేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్ పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను అందించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పంతగాని ప్రేమలత, డాక్టర్ సముద్రాల రమేష్, సిడిపిఓ సుచిత్ర, పిహెచ్‌సి సూపర్వైజర్ పి పద్మావతి,. అంగన్వాడి సూపర్వైజర్ హిమబిందు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళా ఆరోగ్యమే దేశ ఆరోగ్యమని మండలంలోని కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ సమద్ అన్నారు. మండలంలోని ఆరుంబాక పంచాయతీలోని ఏమినేని వారిపాలెంలో ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కామినేని కోటేశ్వరావు, సిహెచ్ఓ వాణిశ్రీ, అరుణ, శ్రీనివాసరావు, రాజకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆకుకూరలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల

సహజ సిద్ధమైన ఎరువులతో రైతులు పండించే ప్రకృతి కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు రావని, ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యమవుతుందని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జెవిఆర్ అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో శుక్రవారం కిండర్‌గార్టెన్ విద్యార్థులతో వెజిటెబుల్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు క్యారెట్, దుంప, టమాట, దోసకాయ, బెండకాయ, వంకాయ, పొట్లకాయతో పాటు పలు రకాల కూరగాయలపై చిత్రాలు, డ్రాయింగ్స్, పెయింటింగ్స్, ప్లకార్డులు ప్రదర్శించారు. రంగు రంగుల దుస్తులు, ఆకర్షణీయమైన అలంకరణలు, పోస్టర్లు ఆకర్షణగా నిలిచాయి. కూరగాయలు తీసుకోవడం వల్ల పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఎంతో మేలుచేస్తుందని వివరించారు. ప్రోటీన్లు, పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. ఆకుకూరలు తీసుకోవడం వల్ల దృష్టి లోపం రాకుండా ఉంటుందని తెలిపారు. చికెన్, మటన్, ఇతర క్రొవ్వు పదార్థాలు పరిమితికి మించి తీసుకోవడం వలన శరీరంలో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. తద్వారా జీవన విధానం ప్రమాద కరంగా మారుతుందని హెచ్చరించారు. పిల్లలు కూరగాయలతో పాటు పండ్లు కూడా తీసుకోవడం అలవాటు చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు కూడా సహజ ఆహారాన్ని ప్రోత్సహించి పిల్లల ఆహారపు అలవాట్లపై శ్రద్ధ చూపాలని సూచించారు.



కూరగాయల ప్లకార్డులతో కిండర్ గార్టెన్ చిన్నారులు



మాట్లాడుతున్న డిఆర్డిఏ డైరెక్టర్ ఎస్ లవన్న

మహిళల జీవనోపాధి పెంపుకు కృషి

ప్రజాశక్తి - పర్చూరు

మహిళల జీవనోపాధి పెంపుకు గ్రామ సంఘాల సహాయకులు కృషి చేయాలని డిఆర్డిఎ పిడి ఎస్ లవన్న పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం నందు గ్రామ సంఘాల సహాయకుల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎస్‌హెచ్‌జి సభ్యులు ప్రతి మహిళ ఎంటర్‌పెన్యూర్‌గా ఎదగాలని తెలిపారు. స్త్రీ నిధి ఉన్నతి, బ్యాంకు లింకేజీ గ్రౌండింగ్ చేయడం, రిగవరీలపైన దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామ సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ డివైసులు పంపిణీ చేశారు. ఎటిఎం రామకృష్ణ, స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, ఎపిఎం కరుణాకర్, సిసిలు శ్రీనివాసమూర్తి, విజయ్ కుమార్, ప్రమీల పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

ప్రజాశక్తి - ముండ్లమూరు

క్రీడలు విద్యార్థులకు ఉల్లాసాన్ని, మానసిక వికాసాన్ని కలిగిస్తాయని తహశీల్దారు ఎల్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 బాల, బాలికలకు ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ షేక్ కాలేశావళి మాట్లాడుతూ గెలుపు ఓటములను అన్న దమ్ముల వలె మెలిగి ఆడాలని అన్నారు. ఖోఖో, కబడి, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మాధవి లత, టాన్య, అరుణ కుమారి, కె పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు చేయూత

ప్రజాశక్తి - వేటపాలెం

పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యకు చేయూత ఇవ్వటం, పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో అవగాహన కలిగే విధంగా చేయటం తమ సంఘం ఆశయమని సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు అన్నారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు సంఘం ద్వారా సయ్యద్ సుభాని, ఎస్ లోకేష్ బాబు, చింతం జగదీష్, పి రాజాబాబుకు రూ.27వేల విలువైన చెక్కులు అందజేశారు. బుర్రా సాంబశివరావు ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని సత్కరించారు. నాగాంజనేయులు, శేఖర్ బాబు, నాగరాజు పాల్గొన్నారు.

వచ్చే ఆగష్టు నాటికి

వెలిగొండ పూర్తయ్యేలా చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

రెండవ సొరంగ మార్గాన్ని సందర్శించారు. పనుల పురోగతిని పరిశీలించారు. ఇప్పటి వరకు పనులు కొనసాగిన తీరు, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం గంటవానిపల్లె చెరువు వద్ద కాలువ పనులను, తీగలేరు వాగును పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దదోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు అతిథి గహంలో ప్రాజెక్టు ఇంజనీరింగ్, భూసేకరణ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ ప్రతినిధులతో కలెక్టర్ రాజాబాబు సమావేశమయ్యారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, పునరావాస కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ఇప్పటికే మొదటి సొరంగం పనులన్నీ పూర్తయ్యాయని ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. రెండో సొరంగం పనులు కూడా 70 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన కలిగే తాగు, సాగునీటి ప్రయోజనాలు, ఇతర వివరాలను ప్రాజెక్ట్ ఎస్.ఇ. అబూత్‌అలీమ్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబుకు వివరించారు.

కలెక్టర్ రాజాబాబు మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండో సొరంగం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి ప్రాధాన్యంగా గుర్తించామన్నారు. అధికారులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందని తెలిపారు. పనులు త్వరగా పూర్తయ్యేలా మరింత దష్టి సారించాలని ఇంజనీరింగ్ అధికారులను, నిర్మాణ ప్రతినిధులను ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ విషయంలో నిర్మాణ సంస్థకు అవసరమైన సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీల కోసం అవసరమైన ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు పూర్తయ్యాయన్నారు. బాధితులకు తగిన నష్టపరిహారం ఇచ్చి ముంపు గ్రామాల నుంచి ఖాళీ చేయించాల్సి ఉందన్నారు. వీటికి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు, ముంపు గ్రామాల ప్రజల తరలింపును వచ్చే ఆగస్టు నాటికి పూర్తి అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో సుమారు 1,90,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా 15 లక్షల మందికి తాగునీటిని సరఫరా చేసేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంపై జిల్లా యంత్రాంగానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రకాశం జిల్లాకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయితే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలలో ఘనీయమైన అభివద్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం నుంచి వలసలను నివారించి సస్యశ్యామలం చేయాలన్న ప్రజల కోరికను నెరవేర్చేలా ప్రభుత్వం కతనిశ్చయంతో ఉందన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి వేదాంత ప్రభాకర్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమస్యపై కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. కలెక్టర్ రాజాబాబు వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, సీతారామిరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ప్రాజెక్టు ఇంజనీరింగ్, నిర్మాణ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జేసీ వ్యాఖ్యలపై మహిళా పోలీసుల అభ్యంతరం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుండి డిపార్ట్ మెంట్‌కు అవసరమైన కీలక సమాచారాన్ని అందిస్తూ నేర నియంత్రణలోను ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించడంలోను అనునిత్యం కష్టపడుతున్న మహిళా పోలీసుల పట్ల ప్రకాశం జిల్లా జేసి కోనంకి గోపాలకృష్ణ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా పోలీసులు ఏం చేస్తున్నారో? అర్థం కావటం లేదని అంటూ ఏక వచనంతో మహిళా పోలీసులను ఉద్దేశించి మాట్లాడటం అభ్యంతరకర మని ఎంపిడిఒ జ్యోతిర్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ అధికారుల నోటి దురుసుతనం మూలంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. జెసి చేసిన వాఖ్యలు మహిళా ఉద్యోగుల మనోభావాలు దెబ్బ తీయడమే కాకుండా మహిళా సాధికారతను అణిచివేతకు గురి చేయడం అని ఆవేదన వ్యక్తం చేశారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన బత్తుల సంధ్యారాణి క్రోసూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన బత్తుల స్వామితో 2024లో వివాహం జరిపించారు. సంధ్యారాణి తన భర్త తనను వేధిస్తున్నాడని పోలీసులకు పిర్యాదు చేశారు. భర్త నరసరావుపేటలో ఫుడ్ కార్పొరేషన్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. మొదట తన భర్త తనపై చాలా ప్రేమ, అనురాగాలు చూపించారని తెలిపారు. కొద్దిరోజుల తర్వాత తన భర్త మొబైల్‌లో వేరొక మహిళ ఫోటోలు కనిపించగా తన భర్తను ప్రశ్నించానని, అప్పట్లో ఆ మహిళ ఫోటోలు తొలగించాడని, అప్పటి నుంచి తన భర్త స్వామి తనపై కక్షపెంచుకొని శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలు పెట్టారని పిర్యాదులో పేర్కొన్నారు. అసభ్య పదజాలంతో దూషించే వారని, వీటికి తోడు అత్త, మామలు వెంకటరమణ, శివ గోవిందరాజు కూడా తన భర్తకు మద్దతు పలుకుతూ తనను వేధింపులకు గురి చేశారని స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఎస్ఐ జెవివి నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పేద మహిళకు తోపుడు బండి అందజేస్తున్న దృశ్యం

మహిళలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - రేపల్లె

మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి, వారికి అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ పేర్కొన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ఒంటరి మహిళకు తోపుడు బండి ఏర్పాటు చేశారు. పట్టణంలోని 6వ వార్డులో నివాస ముంటున్న ఒంటరి మహిళల పద్యాల గాయత్రి నూతన వ్యాపారం చేసుకునేలా ప్రోత్సహించినట్లు తెలిపారు. భర్త దూరమైన తర్వాత ఇద్దరు చిన్న పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లి బాధ్యతలతో గాయత్రి జీవితం కఠినమైందని అన్నారు. తల్లికి వచ్చే రూ.4వేల వృద్ధాప్య పింఛన్‌లోనే ఇంటి అద్దె రూ.2,500 చెల్లించి మిగిలిన డబ్బుతో జీవించలేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నారని చెప్పారు. పాలు తాగె బిడ్డను తల్లి వద్ద వదిలి ఓ దుకాణంలో రూ.200 కూలీకి రోజంతా పనిచేసేదని అన్నారు. మంత్రి సత్య ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగ సొంతంగా వ్యాపారం చేసుకునేలా ఆర్థిక సహాయం అందజేశారని చెప్పారు. జనసేన నాయకులు పరిశ రాజు, దేవగిరి శంకర్, శ్రీకాంత్, సురేష్, వెంకటేశ్వ రరావు, లంకేశ్వర్, గోవర్ధన్, గిరిధర్, గురుబ్రహ్మం అక్రమ్ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - పర్చూరు

శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ జి వినోద్ కుమార్ స్థానిక జూనియర్ కళాశాలలో శనివారం జరుగనున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలుగుదేశం మండల అధ్యక్షులు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షంషుద్దీన్ తెలిపారు.

రూ.6,600 కోట్లతో అభివృద్ధి పనులు

ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - భటప్రోలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలో బాపట్ల పార్లమెంటు పరిధిలో రు.6,600 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ చెప్పారు. మండలంలోని ఐలవరంలో గ్రామస్తులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ ఏడాదిలో 216 జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేందుకు, గుంటూరు నుండి నారాకోడూరు మీదుగా నిజాంపట్నం వరకు నాలుగు లైన్లతో జాతీయ రహదారి కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు. తెనాలి నుండి రేపల్లె వరకు రైల్వే లైన్ 2వ ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలో సూర్యలంక బీచ్ రు.100 కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. 7వేల జనాభా కలిగిన ఐలవరంలో కనీస స్మశాన వాటిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఇచ్చిన ఫిర్యాదులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, ఏడాదికి రూ.25 వేల చేనేత చేయూత వంటి పథకాలను తక్షణమే అమలు చేపట్టి కార్మికులను ఆదుకోవాలని గ్రామస్తులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలించి సిఎం దృష్టికి తీసుకువెళ్లి అమలకు చర్యలు తీసుకుంటానని అన్నారు.



సమస్యలు వింటున్న ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్

పర్యాటక కేంద్రంగా బౌధస్థూపం

అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో బౌద్ధ స్తూప ప్రాంగణంలో ధ్యాన బుద్ధ విగ్రహ నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. బౌద్ధ స్తూపం అభివృద్ధికి ఎన్ని నిధులైన కేంద్రం నుండి తెచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. బౌద్ధ బిక్షవులు ఈ ప్రాంతాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు చేసుకోవడానికి, వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. బౌద్ధ స్తూపం ప్రక్కనున్న చెరువును బోట్ షికార్‌కు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబ, నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాద్, అనగాని ఏడుకొండలు, వానమపల్లి కోటేశ్వరరావు, పులిమి డోలా శివకుమార్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలను ప్రైవేటీకరించొద్దు : వైసిపి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్మించి, నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. బాపట్లలో నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలను వైసిపి నేతలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య కళాశాలలను పప్పు బెల్లాల్లా ప్రైవేట్ పరం చేసేందుకు సీఎం చంద్రబాబు రక రకాల ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. పేదలకు అవసరమైన వైద్య కళాశాలలు ప్రభుత్వం నిర్మించాలని అన్నారు. ప్రైవేటుపరం చేస్తే పేదవాడికి వైద్యం అందనంత దూరంలో ఉంటుందని అన్నారు. ప్రజలకు వైద్యం ఉచితంగా అందించే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం వైద్య కళాశాలలను ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టిందని అన్నారు. వాటిని పూర్తిస్థాయిలో ప్రభుత్వమే నిర్వహించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేట్ పరమైతే పేదవాడికి అవసరమైన వైద్యం కొనలేని ఖరీదవుతుందని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు, రేపల్లె, వేమూరు, చీరాల, అద్దంకి మధుసూదనరెడ్డి, డాక్టర్ ఈవూరి గణేష్, వరికుటి అశోక్ బాబు, కరణం వెంకటేష్, చింతలపూడి అశోక్ కుమార్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మోదుగుల బసవపు న్నారెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, చీరాల వైసిపి నాయకులు కెవి ప్రసాద్, వైసీపీ వికలాంగుల విభాగం నాయకులు చల్లా రామయ్య పాల్గొన్నారు.



వైద్య కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నేతలు

యద్దనపూడి : జగన్మోహన్ రెడ్డి హయాంలో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఛలో మెడికల్ కాలేజి కార్యక్రమానికి అన్ని గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో బాపట్లకు తరలి వెళ్లారు. వైసిపి నాయకులు మువ్వా రాంబాబు, వందనం, నల్లపనేని లక్ష్మినారాయణ, అఖిల్ బాబు, అశోక్, జి సురేష్, తిరుమల కృష్ణ, టి సునీల్, బొబ్బేపల్లి శ్రీకాంత్, బి సామెలు, ఎహ్కాల్, గడ్డం హనుమంతరావు, తిరుపతి సుభాష్, ఎన్ వేణుబాబు, షేక్ బుడే పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - అద్దంకి

విద్యార్థినీ, విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ జి రాధిక అన్నారు. సింగరకొండ కట్టా రామ కోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన స్ఫూర్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ వి మోహన రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎలా జీవిత లక్ష్యాలను నిర్ణయించుకోవాలి, జీవితంలో సవాళ్ళ ఎలా అధిగమించాలి, లక్ష సాధనలో ఎలాంటి పట్టుదల కలిగి ఉండాలి, లైంగిక వేధింపులు, ఫైబర్ నేరాలు, మత్తుమందుల వినియోగం ఇతర సాంఘిక కార్యక్రమాలు, ర్యాగింగ్ వంటి విచర్యల ఫలితాలు విద్యార్థుల జీవితాలు ఎలా నాశనమవుతున్నాయనే అంశంపై వివరించారు. వృక్ష శాస్త్ర విభాగం ఇన్‌క్లూసివ్ సెంటర్, సిజిసి, ఎస్డిసి మహిళా సాధికారిక విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి.



పోలీసు కళాశాల ప్రిన్సిపాల్ జి రాధికను సన్మానిస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాల్లో స్నేహిత ముగింపు ఉత్సవాలు

స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత ఐదు రోజుల నుండి జరుగుతున్న స్నేహిత ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజున విద్యార్థులకు న్యాయవాది టి అనూష మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అవగాహనతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొన వచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం షర్మిళారాణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వలస కార్మికుడు మృతి

ప్రజాశక్తి - బల్లికురవ



ప్రమాదానికి కారణమైన క్రేన్

గ్రానైట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని ఉప్ప మాగులూరు పరిధి లోని హర్షిత గ్రానైట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుడు రాకేష్ కుమార్ (29) మృతి చెందారు. గ్రానైట్ ఫ్యాక్టరీనందు ఉదయం 9 గంటల సమయంలో గ్రానైట్ బండను క్రేన్‌తో ఎత్తుచుండగా క్రేన్ హుక్కుకు ఉన్న గొలుసు తెగిపోవడంతో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాకేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య చికిత్స నిమిత్తం చిలకలూరిపేట హాస్పటల్‌కు తీసుకెళుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నిర్లక్ష్యం వహించిన గ్రానైట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆక్వా రైతులకు లైసెన్సులు తప్పనిసరి

ప్రజాశక్తి - రేపల్లె

ఆక్వా సాగు చేస్తున్న ప్రతి రైతుకు పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అప్పడా చట్టం అనుసరించి సాగుదారులతో పాటు ఆక్వా అనుబంధ పరిశ్రమల యజమానులు కూడా లైసెన్సులు తీసుకోవాలనే నిబంధన తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎస్‌కె కౌసర్ తెలిపారు. ఆక్వా రైతుకు యూడిట్ రూ.1.50 చొప్పున వర్తిస్తుందని అన్నారు. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సవరణ చట్టం సిఎఎ యాక్ట్ 2023 క్రింద ప్రభుత్వ భూములు డికెటి, ఎండోమెంటే వంటి భూములు కూడా రిజిస్ట్రేషన్ చేయుటకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. లైసెన్స్ ఐదేళ్ల కాలపరిమితి దాటి వాళ్లు కూడా పెనాల్టీ చెల్లించి లైసెన్సు అక్టోబర్ 17లోపు పునరుద్ధరించుకోవాలని అన్నారు. 20న పెనుమూడి బీసీ కాలనీ కమ్యూనిటీ హాల్ నందు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యా ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

దాతలు ముందుకు వచ్చి పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందించ తగ్గి విషయమని ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పరిటాల వారిపాలెంలోని ప్రాథమిక పాఠశాల 1నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ కెఎల్ రావు మెమోరియల్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువచేసే నోట్ బుక్స్, పెన్నులు, క్రీడా వస్తువులను కోటేశ్వరరావు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ2 దినేష్ కుమార్, కుందుర్రు జడ్పిహెచ్ హెచ్ఎం బాలయ్య, రిటైర్డ్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, కొండయ్య, యుటిఎఫ్ నాయకులు వలి ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

ఆదాయ వనరులు పెంచాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. సొంత ఆదాయ వనరుల పెంపు కోసం శిక్షణలో భాగంగా స్థానిక ఎంపిడిఒ నందు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలు, మండల పరిషత్తులు కేవలం కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడుతున్నాయని అన్నారు. ఇన్చార్జి ఎంపిడిఒ విజయబాబు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గ్రాంట్లు, పన్నులు, లీజు, లైసెన్సులు, విరాళాలు అన్నిటిపై అవగాహన ఉండాలని అన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకొని ఆదాయం పెంచుకోవడానికి కృషి చేయాలని తెలిపారు. వక్కలగడ్డ సురేష్, దోమ ఉదయభాస్కర్ శిక్షణ ఇచ్చారు.



కార్మికులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

916 మంది పారిశుద్ధ్య కార్మికులకు వైద్యసేవలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్వచ్ఛత హీ సేవా - 2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 916 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం స్థానికంగా ఉన్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఇ.యస్.ఐ. కార్పోరేషన్ వారి సహకారంతో ఏర్పాటు చేశారు. శిబిరాన్ని మేయరు గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇ.యస్.ఐ. కార్పొరేషన్ ఒంగోలు బ్రాంచి మేనేజరు సత్య ప్రకాష్ ఇ.యస్.ఐ. ద్వారా కార్మికులకు వచ్చే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ వైద్య శిబిరంలో ఆర్థో, చెస్ట్, డెర్మటాలజి మరియు సాధారణ వ్యాధులకు సంబంధించిన నలుగురు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ డాక్టర్లు కార్మికులను పరీక్షించి.. సంబంధిత మందులను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కమిషనరు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్లు, నగరపాలక సిబ్బంది, మున్సిపల్ ఇంజనీరు, సహాయ కమిషనరు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్ వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు మరియు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విశ్రాంత ఏడీకి ఘన సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా పశు సంవర్ధక శాఖలో సహాయ సంచాలకులుగా (కురిచేడు)గా పనిచేసి పదవీ విరమణ పొందిన గంటా శ్రీనివాసరావును అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఛాంబర్‌లో గంటా శ్రీనివాసరావును సత్కరించి మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ సహాయ సంచాలకులుగా గంటా శ్రీనివాసరావు శాఖకు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు జగత్ శ్రీనివాస్, పారా శ్రీనివాసరావు, వెటర్నరీ డాక్టర్స్ అనీల్, భరత్, సీనియర్ అసిస్టెంట్ దీపక్, జూనియర్ అసిస్టెంట్ తరుణ్, సతీష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నీలం నాగేంద్రరావు

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నిరుపేద మాదిగ వైద్య విద్యార్థిని కొమ్ము సమీక్షకు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. ఒంగోలు డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో కొమ్ము సమీక్ష అభినందన సమావేశం శుక్రవారం జరిగింది. కాకినాడలోని రంగరాయ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన సమీక్షను నీలం నాగేంద్రరావు అభినందించారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, కాకుమాను రవి, పత్రా బంగారం పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల పట్ల

మర్యాదగా వ్యవహరించండి..

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోలీసు స్టేషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వస్తే... వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సిబ్బందికి సూచించారు. అప్పుడే పోలీసుల పట్ల ప్రజలలో గౌరవం పెరుగుతుందన్నారు. ఒంగోలు నగరంలో ఉన్న తాలూకా పోలీస్ స్టేషన్, రూరల్ సర్కిల్ ఆఫీస్‌తో పాటు ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి,చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ లోనే మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్, లాక్ అప్ రూమ్స్ పరిశీలించారు. స్టేషన్ బయట నిలబడిన ఫిర్యాదుదారులతో స్వయంగా.. మాట్లాడి పోలీసుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో సీజ్ చేయబడిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు అనుమతితో వాహనాలను డిస్పోసల్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డి.ఎస్.పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, తాలూకా ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, ఒంగోలు రూరల్ సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు, సిబ్బంది ఉన్నారు.



తాలూకా పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయాలి

ఎన్నికల కమిషన్ సీఈవో వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలకు సంబంధించిన 2020, 2025 సంవత్సరాల ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయాలని ఎన్నికల కమిషన్ జాయింట్ సీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ఆఫ్ ఎలక్టోరల్ డేటా శిక్షణ కార్యక్రమంపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. మ్యాపింగ్ ప్రక్రియను ఈనెల 26వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా పాల్గొన్నారు.

నేడు పర్చూరులో 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర'

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పచ్చదనంగా బాపట్ల జిల్లాను తయారు చేయడమే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఈ యేడాది రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రతినెల ఒక్కొక్క అంశాన్ని చేపడుతుండగా సెప్టెంబర్ నెల అంశంగా మొక్కలు నాటడం "గ్రీన్ ఎపి" గా చేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈమేరకు జిల్లా లోని పర్చూరులో శనివారం ఉదయం 9 గంటలకు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తోపాటు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా, పార్కులు, బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మొక్కలు నాటుతారని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల కోసం మిశ్రమ ఇంటర్-క్రాపింగ్ అవగాహన కార్యక్రమాలను వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అంగన్‌వాడీల వెతలు తీరేదెప్పుడో.?

నేడు ఒంగోలులో అసోసియేషన్ 11వ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జననం నుంచి బడి ఈడు వరకు చిన్నారులకు ఆహారం, ఆరోగ్యం, అక్షరాభ్యాసం అందించే అంగన్వాడీలు ఆలనాపాలనలో తల్లిని మరిపిస్తుంటారు. 50 ఏళ్ల క్రితం ఐసీడీఎస్ పథకం ద్వారా ప్రారంభమైన ఈ వ్యవస్థలో శిశు మరణాలను తగ్గించడం, తల్లుల సంరక్షణలో విశేష ఫలితాలను సాధించారు. యూనిసెఫ్ కూడా అంగన్వాడీల పనితీరును గుర్తించింది. అంగన్వాడీలు ప్రస్తుతం ప్రభుత్వ విధానాల నిర్లక్ష్యం, వేతనాల సమస్యలు, సాంకేతిక సమస్యలతో ఆందోళనలో ఉన్నారు. ఈ వ్యవస్థ ఆర్థికంగా, సాంకేతికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది.



మహాసభల సందర్భంగా జెండాలను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

అంగన్వాడీ కార్యకర్తలు-ప్రత్యక్ష సేవకులు

పల్లె నుంచి పట్టణం వరకు, ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల దాకా చేర్చే ప్రత్యక్ష కార్మికులు అంగన్వాడీ కార్యకర్తలే.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారం, ఆరోగ్యం, మానసికాభివద్ధి అందించడమే కాకుండా, జనగణన, టీకాలు, సామాజిక సేవలతో పాలనకు తోడ్పడుతున్నారు. కానీ, ఈ సేవలు అందిస్తున్న మహిళలకు మాత్రం సరైన వేతనం లేదు. పదవీ విరమణ తర్వాత భద్రత లేదు, సామాజిక గౌరవం లేదు.

అలుపెరుగని పోరాటం - నిర్బంధాల మధ్య గెలుపు

రెండు దశాబ్దాలుగా అంగన్వాడీలు సంఘటితమై వేతనాల కోసం, భద్రత కోసం, గౌరవం కోసం పోరాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 11,500 వేతనం వర్కర్లకు, 7,000 వేతనం హెల్పర్లకుస్వయంగా ఇచ్చింది కాదు. అంగన్వాడీల కఠినమైన ఉద్యమ ఫలితం. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి వేతనం పెంచలేదు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదు.

2022లో 36 గంటల నిరవధిక సమ్మె, తరువాత రెండు విడతల ఛలో విజయవాడ, 2023 డిసెంబర్‌లో 42 రోజుల చారిత్రాత్మక సమ్మె.. ఈ ఉద్యమాలు అంగన్వాడీల చరిత్రలో మైలురాళ్లు. ప్రభుత్వ నిర్బంధాలు, ఎస్మా బెదిరింపులు, కేసులు, తాళాలు పగులగొట్టి కేంద్రాలు తెరిపించిన సంఘటనలు.. అన్నీ ఎదుర్కొని అంగన్వాడీలు పోరాటం కొనసాగించారు.

సాధించిన విజయాలు-12 జీఓల రూపంలో..

ఈ పోరాటాల ఫలితంగా అంగన్వాడీలు 12 ముఖ్యమైన జీఓలను సాధించుకున్నారు.. అవి..

- రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లు (జీఓ 47)
- హెల్పర్ల ప్రమోషన్ వయసు 45 నుంచి 50 (జీఓ 44)
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్కర్లకు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష..
- హెల్పర్లకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు (జీఓ 47)
- నెలకి ఒక టీఏ బిల్లు సర్క్యులర్
- సమ్మె కాలం వేతనం చెల్లింపు (జీఓ 12)
- 4,867 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ (జీఓ 116)
- 4,867 హెల్పర్ల కేటాయింపు (జీఓ 124)
- గ్రాట్యూటీ అమలు (జీఓ 8)
- సమస్యల పరిష్కారానికి సబ్ కమిటీ (జీఓ 1)
- సెంటర్ల మట్టి ఖర్చులకు రూ.15 వేలు మంజూరు జీఓ

జిల్లాల పోరాటం-స్థానిక విజయాలు

ప్రకాశం జిల్లాలో మద్దిపాడు ప్రాజెక్ట్ సహా పల్నాడు, బాపట్ల అనంతపురం, పలు చోట్ల రాజకీయ జోక్యంతో ప్రమోషన్లు నిలిపివేయబడ్డాయి. అయినా యూనియన్ పోరాటంతో వందలాది హెల్పర్లు ప్రమోషన్లు పొందారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, సంక్షేమ పథకాల అమలు సాధించడం మరో విజయంగా నిలిచింది.

మహాసభల్లో చర్చ-కొత్త దిశ..

ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యే 11వ రాష్ట్ర మహాసభల్లో ఈ సమస్యలన్నింటినీ చర్చించనున్నారు. కనీస వేతనం, సంక్షేమ పథకాల అమలు, వర్కర్లకు ఉద్యోగ భద్రత, భవిష్యత్ ఉద్యమ రూపరేఖలు.. తదితర విషయాలపై మహాసభ వేదికగా నిర్ణయాలు తీసుకోబోతున్నారు.

భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం..

కారుసాల సుబ్బరావమ్మ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మూడు సంవత్సరాలుగా అంగన్వాడీలు మిలిటెంట్ ఉద్యమం చేశారు. నిర్బంధాలు, బెదిరింపులు ఎదురైనా వెనకడుగు వేయలేదు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చిన నిర్ణయం అభినందనీయం. కానీ వేతన సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. కనీస వేతనం రూ 26,000 అమలు చేయాలి. పాండిచ్చేరి మాదిరిగా అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.